
కథ

# భామల్లో భార్య

– జంధ్యాల వెంకటేష్ బాబు



ప్రశాంత్ ఆఫీసు నుండి ఇంటికి రావడం తోనే రేణుకను చూసి కాస్త కంగారుపడ్డాడు.

'ఏం జరిగి ఉంటుందా ?' అని కొద్ది సెకన్లు ఆలోచించాడు.

'పక్కింటి నీరజ చీర కొనుక్కుందా ? ఎదురింటి ఈశ్వరి ఇంటికి ఫ్రిజ్ వచ్చిందా ... ?'

మనసు పరిపరివిధాలా ఆలోచించింది కానీ, ఒక నిర్ణయానికి మాత్రం రాలేకపోయింది.

ప్రస్తుతం తన అనుమాన్ని తీర్చగల ఏకైక వ్యక్తి తన శ్రీమతే కాబట్టి అతడు ఆమె దగ్గరగా నడిచాడు. "హాయ్ రేణూ" అంటూ ఆమె భుజం మీద చెయ్యేశాడు.

రేణుక అతడి చేతిని విసిరికొట్టింది. అతడి ముఖంలోకి తీక్షణంగా చూస్తూ "దయచేసి నన్ను కాసేపు డిస్టర్బ్ చేయకండి" అంది.

ప్రశాంత్‌కి ఆమె మనసులో పుట్టిన 'వాయుగుండం' ఎలాంటిదో అర్థంకాకపోయినా తుపాను తాకిడి ఎక్కువగానే ఉన్నట్లు తెలిసిపోయింది.

"అది కాదోయ్ రేణూ ? అసలు ఇప్పుడు ఏమయిందో చెపితే పోనీ..."

ఆమె అతడి మాటలు మధ్యలోనే కట్ చేసి "చెపితే తీరే సమస్య కాదులెండినాది. అయినా అప్పటి నా మూర్ఖత్వానికి తగిన శిక్షపడింది నాకు."

'రేణుకకు అంత తీరని సమస్య ఏమిటి ?' అన్న ప్రశ్నకు జవాబు కోసం తలబద్దలు కొట్టుకోవాలనుకున్నాడు అతడు. అయినా అందువల్ల ప్రయోజనం లేదని తెలిసి ఆ ప్రయత్నం మానుకున్నాడు.

అతడు బాగా బ్రతిమాలాక ఆమె తన సమస్య చెప్పింది. ఆమె సమస్య విన్నాక అతనికి నవ్వాలో, ఏడవాలో అర్థంకాలేదు. భార్య మీద కోప్పడాలో, జాలిపడాలో తెలియలేదు. 'ఈ ప్రపంచంలో ఏ భార్యా భర్తల మధ్యనయినా ఇలాంటి చర్చ జరిగి ఉంటుందా ?' అన్న అనుమానమూ కలిగింది.

ఇంతకీ ఆమె చెప్పిందేమిటంటే —పదేళ్ళ క్రితం రేణుకకు పెళ్ళి చూపులు జరిగే కాలంలో 'కృష్ణమూర్తి' అనే వ్యక్తి ఓసారి ఆమెను చూసేందుకొచ్చాడు. అప్పట్లో ఆ కృష్ణమూర్తికి ఉద్యోగం లేదు. పైగా అతడు జులాయిగా రౌడీలతో తిరుగుతుంటాడని వాకబులో తేలింది. దాంతో రేణుక తల్లిదండ్రులు ఆ సంబంధం వద్దనుకున్నారు. మరో ఆర్నెల్లకు రేణుకకూ, తనకూ పెళ్ళయిపోయింది. తన దురదృష్టంకొద్దీ ఇప్పుడా కృష్ణమూర్తి ఎమ్మెల్యే అయ్యాడు. ఆ వార్త రేణుక చూసింది. అదే ఆమె బాధ.

".... దేనికయినా అదృష్టం ఉండాలండీ ! అప్పట్లో నేను ఆయనను జులాయి వెధవ, రౌడీ వెధవ అనుకున్నాను కానీ భవిష్యత్తులో ఇంత గొప్పవాడు అవుతాడని ఊహించలేదు. ఇప్పుడు ఆయన ఎమ్మెల్యే అయ్యాడు. రేపు మినిస్టర్ కావచ్చు. ఆ తర్వాత ముఖ్య మంత్రి, చివరికి ఈ దేశ ప్రధాని అయినా ఆశ్చర్యం లేదు. అంటే నేను నా మూర్ఖత్వంతో ఈ దేశ ప్రధానికి భార్యనయ్యే అవకాశం కోల్పోయానన్న మాట. ఎంత బాధాకరమయిన విషయం ఇది. అయినా ఎవరిననుకుని ఏం లాభం లెండి. నా తలరాత ఇలా ఉంది. ఓ ఆఫీసరుకి పెళ్ళాంగా మిగిలిపోవాలని రాసిపెట్టి ఉంది..."

ఆమెది అమాయకత్వంతో కూడుకున్న మూర్ఖత్వమని అర్థమవుతూ ఉండడంతో అతడు మరేం మాట్లాడలేదు.

అప్పుడే పిల్లలిద్దరూ ట్యూషన్ నుండి ఇంటికొచ్చారు. తల్లిదండ్రుల ముఖాలలో సీరియస్‌నెస్ కదలాడడం గమనించి, వాళ్ళ దగ్గరకు వెళ్ళకుండా తమ గదిలోకి వెళ్ళబోయారు.

అది గమనించిన రేణుక వాళ్ళిద్దర్నీ దగ్గరగా రమ్మని సైగ చేసింది. వాళ్ళిద్దరూ దగ్గరగా వచ్చాక 'లవకుశ' సినిమాలో అంజలీదేవి పిల్లలిద్దర్నీ చెరో పక్క ఉంచుకుని ఏడ్చినట్టుగానే ఏడవడం మొదలుపెట్టింది.

ప్రశాంత్‌కి తల నేలకేసి కొట్టుకోవాలనిపించింది. అయినా అలా చేయలేక పోయాడు.

"ఏమిటి రేణూ ! ఇప్పుడేమయిందని ఆ ఏడుపు ?"

పిల్లలు కూడా తల్లికేసి అయోమయంగా చూశారు.

"ఏమిటోనండీ వీళ్ళని చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది."

"ఎందుకు ?"

"ఎందుకేమిటండీ ? ఈ పిల్లలు ఎమ్మెల్యే బిడ్డలుగా కారుల్లో తిరగవలసిన వాళ్ళు నా మూర్ఖత్వం వల్ల చివరికి ఆటో రిక్షాలో స్కూలుకి వెళుతున్నారు. వీళ్ళను చూస్తుంటే నాకు జాలేస్తుందండి... జాలేస్తుంది."

ప్రశాంత్ ఇక ఓర్చుకోలేకపోయాడు. నుదుటి మీద గట్టిగానే కొట్టుకున్నాడు. అలా నాలుగుసార్లు కొట్టుకున్నాక ఆమె వైపు తిరిగాడు.

"జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు నువ్వు కావాలనుకున్నా ఎమ్మెల్యే పెళ్ళానివి కాలేవు కదా ? కాబట్టి గతం తలచుకుని బాధపడడం ఎందుకు ?!" ఆమె మీద కోప్పడడం కన్నా అనునయంగానే చెప్పడంలోనే కొంత ఫలితం ఉంటుందనిపించడంతో చెప్పాడు.

"గతము తలచి వగచే కన్నా సౌఖ్యమే లేదు" అని ఓ కవి అన్నాడు కదండీ. అందుకని..."

"ఆ కవి 'మనిషి ఇలాంటి గతం కూడా తలచుకుని బాధపడుతాడన్న విషయం ఊహించలేదు' అందుకే అలా రాశాడు?" ప్రశాంత్‌కి ఏడుపొక్కటే తక్కువ.

"సర్లేండి ఏం చేద్దాం. గతాన్ని తలచుకుని బాధపడినా నేను ఎమ్మెల్యే భార్యను కాలేను కదా ?" ఆమె నిట్టూర్చింది.

ఆ టాపిక్ అంతటితో ఆగిపోతుందనే అనుకున్నాడు ప్రశాంత్. కానీ రేణుక వదల్లేదు.

అదే రోజు రాత్రి ప్రశాంత్ ప్రేమగా భార్యను దగ్గరికి తీసుకుంటుంటే "ఏమండీ" అంది రేణుక.

అతడు భార్యను స్పర్శిస్తూ "వాట్ రేణూ" అన్నాడు.

"ఎమ్మెల్యే గారి బెడ్ రూమ్‌కి ఏ. సి. ఉంటుంది కదండీ."

"అవును..." అన్నాక గానీ ఆమె ఏ ఉద్దేశ్యంతో అలా అడిగిందో అర్థం కాలేదు. అంతే అతడు ఆనంద లోకంలో నుండి ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు. ముఖం జాలిగా పెట్టి "ఏమిటే... చివరికి ఈ టైమ్‌లో కూడా ఆ ఎమ్మెల్యే ప్రస్తావనేనా ?" అన్నాడు బాధగా.

"అది కాదండీ... నేను ఎమ్మెల్యే భార్యనై ఉంటే ఈ సమయంలో ఏ. సి. రూమ్‌లో ఉండేదాన్ని కదా అని."

పెళ్ళాలు, మొగుళ్ళను ఎన్నో రకాలుగా వేధిస్తారని విని ఉన్నాడు కానీ, ఇలాంటి వేధింపూ ఒకటి ఉంటుందని అతడికి తెలియడం అదే మొదటిసారి.

దాంతో అతడికి కోపం ముంచుకొచ్చింది. "ఇప్పుడు మాత్రం ఆలస్యమెందుకు ? ... వెళ్ళవే ! వెళ్ళి ఆ ఎమ్మెల్యే ఏ. సి. రూమ్ కెళ్ళి 'అప్పట్లో నేను బుద్ధి తక్కువై మిమ్మల్ని కాదన్నాను. ఇప్పుడే నా అజ్ఞానం నాకు తెలిసొచ్చింది. మీ గొప్పతనం బోధపడింది' అని వాడి దగ్గరే ఉండిపో."

"వద్దండి. మిమ్మల్ని, పిల్లల్ని వదిలి నేను ఎలా వెళ్ళగలను ? ఒకవేళ వెళ్ళినా ఎమ్మెల్యేగారి భార్యాబిడ్డలు నేను అక్కడ ఉండేందుకు ఒప్పుకోరు కదా ?"

ప్రశాంత్ తలదిండు అందుకుని అందులోని దూది మొత్తం లాగేశాడు. కొంత దూది తన నెత్తిన వేసుకున్నాడు.

"ఏమిటండీ ? ఈ పిచ్చిపని ?" కాస్త ఆశ్చర్యపోయింది రేణుక.

"నీ లాంటి పెళ్ళాలుంటే మొగుళ్ళకు పిచ్చి పట్టకుండా ఎలా ఉంటుందే ?" ప్రశాంత్ బెడ్ మీద రెండు పిల్లిమొగ్గలు కూడా వేశాడు.



ఏమనుకుందో ఏమో, రేణుక అప్పటికి మరేం మాట్లాడకుండా మరో వైపుకు తిరిగి పడుకుండిపోయింది.

ప్రశాంత్‌కి ఆ రాత్రి నిద్ర లేదు.

వాళ్ళ సంసారం అలా సాగుతూ ఉండగా మరికొద్ది రోజుల్లో కృష్ణమూర్తి మినిస్టర్ అయ్యాడు.

రేణుక మరోసారి తన 'గతంలోని తప్పు' ను తలచుకుని బాధపడింది. 'అప్పుడే కనుక తను కృష్ణమూర్తిని పెళ్ళాడి ఉంటే 'మినిస్టర్ పెళ్ళాం' గా కారుల్లో తిరుగుతూ విమానాల్లో విదేశాలకు వెళ్ళే యోగం ఉండేది కదా ?'

ఆమె మనసులో బాధపడితే ఫర్వాలేదు. మొగుడు, పిల్లల ముందు ఈ విషయమే ప్రస్తావించి వాళ్ళకూ మనశ్శాంతి లేకుండా చేసేది.

ఓ రోజు ప్రశాంత్ ఆఫీసు నుండి రాగానే పేపర్ చూపిస్తూ చెప్పింది —"ఏమండోయ్ ఈ వార్త చూశారా ? కృష్ణమూర్తిగారి దంపతులకు రవీంద్రభారతిలో సన్మానం జరుగుతోంది. .... నా దురదృష్టం కానీ, ఆయన భార్య స్థానంలో నేను ఉండి ఉంటే ఆ సన్మానం నాకే జరిగేది కదా ?"

మరో రోజు "ఈ రోజు మినిస్టర్ కృష్ణమూర్తిగారు చాలా ఆఫీసులకెళ్ళి అక్కడ మీలాంటి ఆఫీసర్ల మీద కోప్పడ్డారట. ఎంతయినా మినిస్టర్ల హోదానే వేరు. ఆయన ముందు మీలాంటి ఆఫీసర్లు చేతులు కట్టుకోవలసిందే" అంది.

ప్రశాంత్‌కి భార్య ధోరణి ఒక్కోసారి కోపం కలిగించేంది. మరోసారి తన మీద తనకే జాలి కలిగేలా చేసేది. ఇంకోసారి భార్య అమాయకత్వానికి కూడా బాధపడే వాడు.

కోపతాపాలు పక్కన పెడితే రేణుక 'గతం తలచి వగచే' పని ఎప్పుడు మానుతుందా అని ఆతడు నిరంతరం ఆలోచించేవాడు. కానీ ఎంత ఆలోచించినా ఒక్క ఐడియా కూడా రాలేదు.

తను ఈ 'కొత్త రకం వేధింపు,నరకం అనుభవిస్తూ సాగిపోవలసిందే' అని అతడు నిర్ణయించుకుంటున్న వేళలో ఓ సంఘటన జరిగింది.

★ ★ ★ ★

ఉదయం పేపర్ తిరగేస్తుంటే కనిపించిందా వార్త !

'మినిస్టర్ కృష్ణమూర్తి బడా కుంభకోణం.'

ప్రశాంత్ ఎగిరి గంతేశాడు. ఈలవేస్తూ హాలులో కుప్పిగంతులు వేయసాగాడు.

పక్క గదిలో చదువుకుంటున్న పిల్లలు హాల్లోకి వచ్చి తండ్రి చేష్టలు చూసి ముఖాలు చూసుకోసాగారు.

వంట గదిలోని రేణుక హాల్లోకి వచ్చాక కొద్ది క్షణాలు అయోమయంగా భర్తకేసి చూసింది. కొద్దిసేపటికి తేరుకుని భర్త దగ్గరగా వెళ్ళి "ఏమిటండీ ... ఏమయిందీ మీకు ?" అని అడిగింది.

"నాకేం కాలేదే... నాకేం కాలేదు... మినిస్టర్ కృష్ణమూర్తి చాలా పెద్ద కుంబకోణం కేసులో ఇరుక్కున్నాడు. ఇక అతడికి సెంట్రల్ జైలు ఖాయం..." అంటూనే డ్యాన్స్ చేయసాగాడు.

ప్రశాంత్ ఏమన్నాడో అర్థమయ్యేందుకు ఆమెకు కొన్ని సెకన్లు పట్టింది. ఆమె ముఖం పాలిపోయింది.

అతడు డ్యాన్స్ చేయడం ఆపాడు. "ఏమిటో ! నీ దురదృష్టంగానీ, ఆ మినిస్టర్ కృష్ణమూర్తిని పెళ్ళి చేసుకుని ఉంటే, జైల్లో ఉన్న మొగుడితో కాపురం ఎంత సుఖంగా ఉండి ఉండేదో... నిన్ను చూస్తుంటే నాకు జాలేస్తుంది రేణూ..."

రేణుక ముఖంలో బాధ మాయమయింది. ఆమె చిరు నవ్వుతో చెప్పింది.

"అందుకే అన్నాడో కవి 'జరిగేవన్నీ మన మంచికని, అనుకోవడమే మనిషి పని' అని... ! .... ఆ రోజు నా పెళ్ళి ఆ మినిస్టర్‌తో జరక్కపోవడం నా అదృష్టం అని నాకిప్పుడే అర్థమయింది ?"

ఆమె చాలా సులభంగా విషయం తేల్చేసి వంట గదిలో కెళ్ళిపోయింది.

అది చూసి ప్రశాంత్ అలాగే నోరు తెరుచుకుని ఉండిపోయాడు. ●